క్లుప్తంగా

పీలేరు ఆక్షా మసీదులో సహరీ ఏర్పాటు

పీలేరు రూరల్ : రంజాన్ మాసం పురస్కరించుకుని స్థానిక ఆక్షా మసీదులో ముస్లిం మైనారిటీ సోదరులకు సహరీ ఏర్పాటు చేసినట్లు మసీదు కమిటీ సభ్యులు అతికా షఫీ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభం అయినప్పటి నుంచి నెల రోజుల పాటు ఉపవాస దీక్ష చేపట్టే ముస్లిం సోదరుల (కార్మికులు, ఉద్యోగులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి) సౌకర్యార్థం సహరీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం నాలుగు గంటలకే సహరీ ఏర్పాటు చేస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కలికిరిలో ఎమ్మెల్యే పర్యటన

కలికిరి: పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం కలికిరిలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మండలంలోని మర్రికుంటపల్లి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం, 4.30 గంటలకు కలికిరిలోని మెయిన్ స్కూల్ ఆవరణలో నియోజకవర్గ స్థాయి చేయూత కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా బీరప్ప ఉత్సవం

కలికిరి: మండలంలోని పత్తేగడ గ్రామం పాళెం కురవపల్లిలో గ్రామస్తులు ఘనంగా బీరప్ప స్వామి ఉత్సవం నిర్వహించారు. శనివారం రాత్రి బీరప్పస్వామి మేలుకొలుపు, అనంతరం ఉత్సవ విగ్రహాలను అంగరంగ వైభవంగా మేళతాలాలు, చెక్కభజనలు, కోలాటాలు, కత్తుల ఆట, మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటా స్వామివారికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నారాయణ, క్రిష్ణమూర్తి, భాస్కర, ఎల్‌రాజ, బీరయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

20 మంది జూదరుల అరెస్ట్

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జూదం ఆడుతున్న 20 మందిని అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలోని పోతబోలు వద్ద జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.35,000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా టీకులపాళెం సమీపంలో జూదం ఆడుతున్న 9మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.19,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచామన్నారు.

రాజేంద్రనాయక్‌కు డాక్టరేట్

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె పంచాయతీ దిగువ వగ్లకు చెందిన బుక్కే రాజేంద్రనాయక్‌కు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. ‘చిత్తూరు జిల్లా గిరిజనుల విజ్ఞానం – పరిశీలన’ అంశంపై రాజేంద్రనాయక్ పరిశోధన చేశారు. ఆయన పరిశోధనకు గానూ ఆంధ్ర విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.వి.జి.డి. ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ స్వీకరించారు. రాజేంద్రనాయక్ మాట్లాడుతూ ఆచార్యులు జె. అప్పారావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు.

సంఘమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి సదుం పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన పలు పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ శారదతో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ ఆనందరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఈశ్వరప్ప, కట్టా సురేంద్ర, పెద్దప్పయ్య తదితరులు ఆమెను సాదరంగా ఆహ్వానించారు. వేద పండితులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బహిరంగ సభలకు అనుమతులు తప్పనిసరి

వాల్మీకిపురం: మండలంలో ఎక్కడైనా బహిరంగ సభలు నిర్వహించాలన్నా.. మైక్, ఊరేగింపులకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సీఐ పులిశేఖర్ సూచించారు. ఆయన మాట్లాడుతూ రాయచోటి డీఎస్పి మహబూబ్ బాషా ఆదేశాల మేరకు ఈ నెల 31వ వరకు పోలీస్ సెక్షన్ 30, 30ఎ అమలులో ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మైక్‌లు పెట్టినా, ఊరేగింపులు నిర్వహించినా, బహిరంగ సభలు ఏర్పాటు చేసినా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

వాల్మీకిపురం: డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో చేరేందుకు ఆదివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు 108 మందికి గానూ 85 మంది హాజరై పరీక్షలు రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కల్పన, అబ్జర్వర్ నాగవేలు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

డీఎస్పీ ప్రసాదరెడ్డి



పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు, కేంద్ర బలగాలు

మదనపల్లె : శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు భద్రత, భరోసా కల్పిస్తామనేందుకే పోలీసులు, కేంద్ర సాయుధబలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరుగుతోందని డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు ... డివిజన్‌లోని పోలీస్‌సిబ్బంది, కేంద్ర బలగాలైన సహస్ర సీమాబల్(ఎస్ఎస్‌బి)తో కలిసి ఆదివారం సాయంత్రం పట్టణ పురవీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నక్కలదిన్నె సత్సంగ్ ఆశ్రమం నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ సురభికాలనీ, నక్కలదిన్నె తండా, గాంధీపురం, పీఅండ్‌టీ కాలనీ, సొసైటీ కాలనీ, ఎన్‌టీఆర్ సర్కిల్, బిసెంట్ సర్కిల్, శ్రీకృష్ణ దేవరాయసర్కిల్, బెంగళూరుబస్టాండ్, అప్పారావు తోట, వెంకటరమణస్వామి దేవాలయం, జామియా మసీదు, తారకరామసర్కిల్, ఇందిరానగర్, మార్వారివీధి, కృష్ణానగర్, ఎస్‌బీఐ కాలనీ, రామారావు కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వలీబాషు, టూటౌన్ సీఐ యువరాజ్, తాలూకా సీఐ శేఖర్, డివిజన్‌పరిధిలోని ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

40 ఏళ్ల అనుభవం కాళ్లా వేళ్లా పడేందుకా

- బీజేపీ రాష్ట్రానికి ఏం చేసిందని పొత్తుకు వెంపర్లాట
- స్వార్థ రాజకీయ ప్రయోజనాలకే బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు
- బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతంకుమార్



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతంకుమార్

మదనపల్లె : ఢిల్లీలో మూడురోజులుగా బీజేపీ పెద్దల కోసం పడిగాపులు కాస్తూ, మెడపట్టి బయట తోసినా అలాగే వేచిఉండి అపాయింట్‌మెంట్ తీసుకుని, కాళ్లా వేళ్లా పడి బీజేపీతో పొత్తుకుదుర్చుకునేందుకే ఆయన 40 ఏళ్ల రాజకీయ అనుభవం పనికివచ్చిందని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతంకుమార్ అన్నారు. ఆదివారం బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.... తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు ఏమాత్రం కాదని అన్నారు. 2014లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం బీజేపీతో పొత్తు అంటూ చంద్రబాబునాయుడు ప్రకటించి, అధికారంలోకి వచ్చాక 54 నెలలు కలిసి ఉండి, బీజేపీతో విభేదించారన్నారు. తర్వాత..బీజేపీ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని, ప్రత్యేక హోదా, రైల్వేజోన్, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదని, పోలవరం, అమరావతి రాజధాని తదితర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఇవ్వలేదన్నారు. అసెంబ్లీలో నల్లచొక్కాలు ధరించి నిరసన తెలిపి కడుపు తరుక్కుపోతోందంటూ ఆవేదనతో చంద్రబాబు ఆవేదనతో మాట్లాడారన్నారు. సరిగ్గా పదేళ్ల తర్వాత నేటికీ బీజేపీ రాష్ట్రానికి చెప్పిన హామీలన్నింటినీ నెరవేర్చకపోయినా... ఢిల్లీకి పనిగట్టుకుని పోయి మరీ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో ప్రజలకు తెలపాలన్నారు. పొత్తు కేవలం తన అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప ప్రజల కోసం కాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు బీజేపీ చేసినంత మోసం ఏ రాజకీయ పార్టీ కూడా చేయలేదని, పొత్తుతో వస్తున్న ఈ పార్టీలను ప్రజలు ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమణ, గంగాధర్, బాలాజీ, శ్రీనివాసులు, లక్ష్మీపతి, సంధ్య, మహేష్, ప్రసాద్, వేణు, కన్నయ్య, ఉత్తన్న, నల్లప్ప, రెడ్డెప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రూ. 8.92 లక్షల ఆదాయం

పీలేరు రూరల్ : మహా శివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులతో పీలేరు డిపోకు రూ. 8.92 లక్షలు ఆదాయం సమకూరినట్లు డీఎం కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తలకోనకు 33 సర్వీసులు నడిపి రూ. 7.69 లక్షలు ఆదాయం సాధించినట్లు తెలిపారు. కలకడ ఝరికి 7 సర్వీసులు నడిపి రూ. 1.23 లక్షలు ఆదాయం వచ్చినట్లు వివరించారు. ఓఆర్ 92 శాతం వచ్చినట్లు తెలిపారు. ఆదాయం సాధించడానికి కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.

ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి: మండలంలోని మహల్ యర్రదొడ్డిపల్లికి చెందిన డాక్టర్ వై.రామ్మోహన్ రెడ్డి(75) శుక్రవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదివారం యర్రదొడ్డిపల్లికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అద్దవారిపల్లి సర్పంచ్ గంగయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, ఎంపీటీసీ సభ్యులు సావిత్రిప్రదీప్‌రెడ్డి, వై.కిశోర్ రెడ్డి, సునీల్ తదితరులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

సరిహద్దు చెక్ పోస్ట్ తనిఖీ

రామసముద్రం: రామసముద్రం సరిహద్దు చెక్‌పోస్టులను మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం కొండపై వెలసిన వాలీశ్వరస్వామి రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీబందోబస్తు నిర్వహించారు. ఎస్ఐ చంద్రశేఖర్‌ని మండలంలోని సరిహద్దు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని బార్డర్ చెక్‌పోస్టులను తనిఖీ చేసి తగు సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో బార్డర్ చెక్‌పోస్టులలో వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేయాలని, ఎవరైన మద్యం, నగదు, వంటివి పట్టుబడితే ఎంతటి వారినైనా క్షమించేది లేదన్నారు. తనిఖీల్లో సీఐ సద్గురుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లి అయిన అమ్మవారి ఆలయానికి వేకువజాము నుంచే భక్తులు చేరుకొన్నారు. మహిళలు అమ్మవారి కోనేట్లో స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. అలాగే పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా మస్తాన్‌వలి దర్గా ఉరుసు



ఉరుసు ఉత్సవాల్లో నిస్సార్ అహ్మద్

మదనపల్లె సిటీ: స్థానిక కోటవీధిలోని హజరత్ మస్తాన్‌వల్లి దర్గా ఉరుసు ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉరుసు పురస్కరించుకుని దర్గాను రంగురంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నిస్సార్‌అహ్మద్ ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని దువా చేశారు. దర్గా కమిటీ నిర్వాహకులు అన్నదానం కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ మనూజరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్లు జింకా చలపతి, నూర్ ఆజామ్, కౌన్సిలర్లు ఖాజా, ముబీనా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్ఫాన్‌ఖాన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వాల్మీకిపురం: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయిక్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కుమార్‌నగర్, కొత్తపేటవీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు సుదీర్ఘ పాదయాత్ర చేసి, గ్రామీణ ప్రజల కష్టాలను, గ్రామాల్లో నెలకొన్న దుస్థితులను కళ్లారా చూశారన్నారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు చేపట్టడానికి అదే కారణమన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి, మాట తిప్పనినేతగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కీర్తి గడించారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్మోహన్ రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. బీసీలకు అమలు చేసిన నవరత్నాల పథకాలతో బెంబేలెత్తిన చంద్రబాబు బీసీ డిక్లరేషన్ అంటూ మాయ మాటలతో మళ్లీ మన ముందుకు వస్తున్నాడని, ఆ మాటలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగనన్న పాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారన్నారు. జగనన్న మనందరి కోసం నాలుగున్నరేళ్లుగా బటన్‌లు నొక్కి సంక్షేమానికి, అభివృద్ధికి, సంక్షేమం జరిగేందుకు జగనన్నకు రెండుసార్లు ఆందరూ బటన్ నొక్కి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో చింతల శివానంద రెడ్డి, సుధాకర, శేషాద్రి రెడ్డి, సత్తిరెడ్డి, మహేష్, షాహెద్, ముబారక్, ఇర్ఫాన్, అషర్, సాగుబడి ఆనంద రెడ్డి, రఘు, రవి, ప్రవీణ్, రోహిత్, అశోక్, కిరణ్, నవీన్ పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయాన్ని అందించాలి



ప్రచారం చేస్తున్న డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డి గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పంచాయతీరాజ్ జిల్లా అభివృద్ధి సలహామండలి సభ్యుడు డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. ఆదివారం షెకీనా సువార్త ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శంకరాపురం తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని కోరారు. జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.వి. చలపతి, వార్డు మెంబరు అబీద్, కాలేషా, ఏఎంసీ డైరెక్టర్ మునీర్, నాయకులు రియాజ్, జిలాని, షారూ, ముస్తఖ్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

పీలేరు : వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ బంగారు అంచు ఎస్సీ కాలనీలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్ మాట్లాడుతూ మహిళాశక్తికి ఆమె ఒక నిదర్శనమని పేర్కొన్నారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మిన ఆమె స్త్రీలకు చదువు చెప్పి, వారిలో చైతన్యం నింపిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. మహిళలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గట్టప్ప, సుభాష్, ముల్లంగి కృష్ణయ్య, రెడ్డెయ్య, ఆనంద్, బాల గంగాధర్, పాలకుంట శ్రీనివాసులు, మల్లికార్జున, ప్రసాద్, విజయ్‌కుమార్, రెడ్డెమ్మ, వరలక్ష్మీ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

గుర్రంకొండ: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఆదివారం మండలంలోని గుర్రంకొండ, తరిగొండ, మర్రిపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తప్పనిసరిగా విద్యుత్ సౌకర్యం ఉండేలా ముందుగా చూసుకోవాలన్నారు. వికలాంగులు సులభంగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి అనువైన ర్యాంప్‌లను వెంటనే సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలు ఉండే పాఠశాలల్లో చుట్టూరా ప్రహరీ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఆయా పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్లో అత్యధికంగా ఎనిమిది పోలింగ్ కేంద్రాలు ఉన్నందును నిర్మాణంలో ఉన్న ప్రహరీ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు నిత్యం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్, ఎస్ఐ నాగార్జునరెడ్డి, ఎంఈవోలు సురేంద్రబాబు, సుబ్రమణ్యం, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మారు పేరు తంబళ్లపల్లి

- జగనన్నను మరోసారి ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



పార్టీలో చేరిన వారినుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పెద్దతిప్పసముద్రం: గత 40 ఏళ్ళలో ఎన్నడూ లేని విధంగా తంబళ్లపల్లి నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలోనే తంబళ్లపల్లి అభివృద్ధికి మారుపేరుగా నిలిచిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన మండలంలోని దేవప్పకోట పంచాయతీ దొరిగుండ్లవారిపల్లిలో పర్యటించారు. జగనన్న పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా పథకాలు మంజూరు చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలంతా మళ్ళీ నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన ఏకైక నాయకుడు జగనన్న అన్నారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా తక్షణం వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడతానని ఆయన ప్రజలకు భరోసా కల్పించారు. ఆయన వెంట మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, గణపతిరెడ్డి, డ్రిప్ రమణ,రియాసత్ అలీఖాన్, కొట్టి మల్లికార్జున, అనితం, సుబ్బరాం, పట్టిరిక శంకర్, కుంచే శీనాతో పాటు స్థానిక నాయకులు ఖాదర్‌వలి, సయ్యద్‌బాషా, శంకర్‌రెడ్డి, మెకానిక్ చంద్ర, భాస్కర్‌నాయుడు, ఆనంద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక

దొరిగుండ్లవారిపల్లికి చెందిన 15 కుటుంబాల ప్రజలు ఆదివారం కేఎస్ శ్రీనివాసులు, శంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నారాయణ,రామస్వామి, శ్రీనివాస్, నవీన్, ప్రసాద్, నరసింహులు, సుకుమార్, మదన్ మోహన్, బావాజాన్, సయ్యద్ బాషా, అన్వర్ తదితరులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని చూసి తాము టీడీపీని వీడామన్నారు. ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఆర్యవైశ్యులు ఐక్యమత్యం చాటాలి

వార్మ్ ఏపీ అధ్యక్షులు సుబ్బరాజు



ఆర్యవైశ్య సంఘ నాయకులను సన్మానిస్తున్న వాసవీ ట్రస్టు సభ్యులు

మదనపల్లె సిటీ: ఆర్యవైశ్యులు ఐక్యమత్యం చాటాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వార్మ్) ఏపీ అధ్యక్షులు జక్కా సుబ్బరాజ్ అన్నారు. ఆదివారం స్థానిక బొంతలవారి కళ్యాణమండపంలో శ్రీవాసవీ ట్రస్టు అధ్యక్షులు మాకం అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆర్యవైశ్యులు అధికంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఓటింగ్ పాల్గొనాలని కోరారు. తిరుపతిలోని కోట్లు విలువ చేసే కన్యాకా పరమేశ్వరి ఆలయ భూములను సుప్రీం కోర్టుకు వెళ్లి భూములు కాపాడుకున్నామన్నారు. అందరి సహకారంతోనే సాధ్యమైందన్నారు. కాణిపాకం ట్రస్టు సభ్యులు నరసింహులు శెట్టి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కోసం తాను అండగా ఉంటానన్నారు. తనకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చిందన్నారు. పలమనేరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. అందరూ కలసికట్టుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పుసుపర్తి గోపినాథ్, శ్రీనివాసులు, దిండుకుర్తి నరసింహులు, మదనపల్లె నాయకులు గార్ల చంద్రమౌళి, బింగి పాండు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. తిరుపతి చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకులతో పాటు జిల్లాలోని పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులను ఘనంగా సన్మానించారు.

వైభవంగా వాలీశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న నాయకులు



రథోత్సవంలో మల్లయ్య దొరల విన్యాసాలు

రామసముద్రం: రామసముద్రం మండలం ఆర్.నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీవాలీశ్వరస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు లోకనాథం దీక్షిత్ కుమారులు మణికంఠ దీక్షితలు తదితరులు ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, పలు రకాల పుష్పాలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రథోత్సవంకు ఆలయ ప్రధాన అర్చకులు, గ్రామస్తులు భారీ ఏర్పాట్లు చేశారు. రథోత్సవం సందర్భంగా డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ సద్గురుడు , ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. అలాగే కొండపై జరిగిన రథోత్సవం తిలకించడానికి వచ్చిన భక్తులకు ఎలవానెల్లూరు సర్పంచ్ ఉదయ్ శంకర్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు. జెడ్పీటిసి రామచంద్రారెడ్డి, సర్పంచ్ ఆదినారాయణ, ఎంపీటీసి రెడ్డెప్ప, గ్రామపెద్దలు రథోత్సవంకు భారీ ఏర్పాట్లు చేశారు.

కనుల పండువగా రథోత్సవం

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన రథోత్సవ వేడుకలు కన్నుల పండువగా నిర్వహిచారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివాలయం సేవకులు పట్టాభి రామయ్య, ఆకుల మల్లికార్జునల ఆధ్వర్యంలో జరిగిన మంగళ వాయిద్యాలు, మల్లయ్య దొరల విన్యాసాలు, బళ్ళారి డ్రమ్ముల శబ్దాలు, పండరి భజనలు, కోలాటలు, పిల్లన గ్రోవి భజనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేద పండితులు ఉత్సవ మూర్తుల ప్రతిమలను సుందర పుష్పాలతో అలంకరించారు. భక్తులు ఉపవాస దీక్షతో పూజలు నిర్వహించారు. శివ నామ స్మరణలతో గ్రామ పుర వీధులు మార్మోగాయి. భక్తులు ఉత్సాహంగా తీరు లాగారు.